నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర ఏడీఈ టౌన్ 1 ఆర్. చంద్రశేఖర్, ఏడీఈ టౌన్ 2 తోట రాజశేఖర్, ఏడీఈ టౌన్ 3 పీ. విరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు పనులు చేపట్టనున్నందున నిజామాబాద్ పట్టణంలోని పవర్ హౌస్ ,మిర్చి కాంపౌండ్, తిలక్ గార్డెన్ ,సుభాష్ నగర్, బోర్గం, అర్సపల్లి , వినాయక నగర్, దుబ్బ న్యూ హౌసింగ్ బోర్డ్, ముబారక్ నగర్, గోపన్ పల్లి విద్యుత్ ఉపకేంద్ర లలో ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 24 జూన్ 2023

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ప్రకారం. మోపాల్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఆటో బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న రాజమ్మ(60) మృతి చెందింది. కాగా డ్రైవర్ పాషా, మరో ప్రయాణికురాలు ఊచవ్వలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై మహేష్ తెలిపారు.

దరఖాస్తు ముగిసింది..
మంజూరు మిగిలింది

- జిల్లా వ్యాప్తంగా 17,282 దరఖాస్తులు
- మరోసారి దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న లబ్దిదారులు



నవతెలంగాణ-భిక్కనూర్

బీసీ కులాల వారికి, కుల వృత్తులకు రూ.లక్ష సాయం కోసం దరఖాస్తుల స్వీకరణ ముగిసిన విషయం విధితమే. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 17,282 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాటి నుండి గడువు ముగిసే వరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మీసేవ, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రతిరోజు ప్రదక్షిణలు చేసి చివరాకరకు దరఖాస్తు చేసుకోగా.. చివరి రోజు సర్వర్ డౌన్‌తో చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారు. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవ డానికి తక్కువ సమయాన్ని కేటాయించి దరఖా స్తు చేసుకోవాలని సూచించ డంతో ఆన్‌లైన్ సర్వర్‌లు మొరాయించ డంతో తీవ్ర ఇబ్బందులు ఎదురైయ్యారు. ప్రభుత్వం మరోసారి దరఖాస్తులు స్వీకరించేందుకు గడువు ఇవ్వాలని పలువురు లబ్దిదారులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో బీసీ కులవృత్తుల దరఖాస్తు కోసం 17,282 దరఖాస్తులు వచ్చాయి. అయితే గడువు ముగియడంతో చాలామంది నిరాశ చెందారు. గ్రామాల వారీగా దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శు లకు బాధ్యతలు అప్పగించారు. జీపీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి ఎంపీడీవోలకు నివేదించనున్నారు. తదనంతరం బీసీ కార్పోరేషన్‌కు దరఖాస్తులు పంపనున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి జూలై 15వ తేదీ నుంచి ఆర్థికసాయం చెక్కులను మంజూరుచేయనున్నట్టు సమాచారం. అయితే మండలంలో ఎంతమందికి రుణాలను అందజేస్తారు..? అన్న ఆందోళన మొదలైంది. ఈ విషయం పై మండల, జిల్లా అధికారుల సైతం దరఖాస్తు చేసుకున్న వారిని ఎలా ఎంపిక చేస్తారు, మొదటి విడతగా ఎంతమందికి ఇస్తారు, దరఖాస్తుల పరిశీలన ఎలా జరుగుతుంది అనే సమాచారం కూడా అధికారుల వద్ద లేదు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత లబ్దిదారులను మాత్రమే ఎంపిక చేసి చేతులు విదిలిస్తుందా.. ప్రతి నెల దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపిక చేసి లక్ష రూపాయలు రుణాలు మంజూరు చేస్తుందా అని దరఖాస్తు చేసుకున్న, చేసుకోలేని అభ్యర్థులలో ప్రశ్న మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర ప్రక్రియ అని ప్రకటన చేసిన అసెంబ్లీ ఎన్నికల సమయం వస్తున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ సమయంలో రుణా లు ఎలా మంజూరు చేస్తారు? మొదటి విడత మాత్రమే రుణాలు మమ అనిపిస్తాదా అని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

స్టేషనరీ, పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

- నవతెలంగాణ కథనం నేపథ్యంలో ఎంఈవోలకు డీఈవో ఆదేశాలు

నవతెలంగాణ-భిక్కనూర్



కామారెడ్డి జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యా సంస్థలు స్టేషనరీ, పుస్తకాలు విక్రయించరాదని జిల్లా విద్యాధికారి రాజు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. "ప్రైవేట్ పాఠశాలలో స్టేషనరీ దోపిడీ" శీర్షికతో నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. కామారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు మండలాలలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు ఎంఈఓ నోటీసులు జారీ చేశారు. ఎంఈఓ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలలో తనిఖీలు నిర్వహించి ప్రైవేట్ విద్యా సంస్థలలో స్టేషనరీ, పుస్తకాలు విక్రయించిన అట్టి విద్యా సంస్థల పుస్తకాలను స్వాధీనం చేసి సీజ్ చేయాలని, పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు.

పలకరించిన తొలకరి

- జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు.. అన్నదాతల హర్షం
- ఉక్కపోత నుంచి ఉపశమనం



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఎట్టకేలకు తొలకరి జల్లులు జిల్లాను పలకరించాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మూడు వారాల ఆలస్యంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల చిరుజల్లుల వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతేటా నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశిస్తుండగా.. ఈసారి మూడు వారాలు ఆలస్యమైనా చినుకు జాడ లేకపోవడంతో రైతులు కలవర పడ్డారు. దీనికి తోడు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తొలకరి పలకరించడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తునఆనరు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల చిరుజల్లుల వర్షం కురిసింది.

రైతులు ఇప్పుడే విత్తనాలు నాటుకోవద్దని, రెండుమూడు రోజులు భారీ వర్షాలు కురిసిన తర్వాతనే విత్తనాలు, నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధి కారులు సూచిస్తున్నారు. భూమిలో వేడి తగ్గిన తర్వాత సాగుచేపట్టుకోవాలని సూచిస్తున్నారు.

పేదలకు న్యాయ సాయం

- లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ఉద్దేశ్యం అదే
- కార్యాలయం ప్రారంభోత్సంలో జిల్లా జడ్జి ఎస్.ఎన్ శ్రీదేవి

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

న్యాయవ్యవస్థలో నిరుపేదలకు న్యాయ సహాయం సమర్థవంతంగా అందించడానికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయం ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి ఎస్.ఎన్ శ్రీదేవి అన్నారు. జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవ సమస్త ఆధ్వర్యంలో శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనుభవజ్ఞులైన న్యాయవాదుల ద్వారా పేదలకు సకాలంలో న్యాయ సహాయం అందుతుందని తెలిపారు. న్యాయం సహాయం కోరే నిరుపేదలకు నవీకరణకు దారి తీసే మెరుగైన ప్రతిస్పందన, కేసుల పురోగతి ఉంటుందని చెప్పారు. న్యాయ సహాయ ప్రదాతల పక్షాన జవాబుదారీతనాన్ని నిర్ధారించడం కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం రూపొందించామని వెల్లడించారు. క్రిమినల్ విషయాలలో న్యాయ సహాయం అందించడానికి ఈ సిస్టం దోహదపడుతుందని తెలిపారు. అరెస్ట్ అయిన నిరుపేద వ్యక్తులు న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేని వారికి ఈ సిస్టం ద్వారా సలహాలు, సూచనలు అందించి సత్వర న్యాయం అందించే వీలు కలుగుతుందని చెప్పారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా బి. రమేష్ చందు, కే. మోహన్ రావు, పల్లె చిరంజీవి నియమితులయ్యారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి టి. భార్గవి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, సబ్ జైలు సూపరిండెంట్ శ్రీధర్, బార్ సోసియేషన్ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పర్యవేక్షకులు చంద్ర సేన రెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి

మట్టి పరీక్షలకు మంగళం

- బడ్జెట్ కేటాయింపులు నిల్



మట్టిపరీక్షలు చేస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా.. భూసార పరీక్షల జాడ కనిపించడం లేదు. మట్టి పరీక్షలు చేపడితే.. నేల స్వభావం, ఎరువుల వాడకం, దిగుబడులు, సాగు చేసే పంటల రకాలు తదితర అంశాలు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ గ్రామాల్లో ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5 లక్షల 16 వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వీటిల్లో అత్యధికంగా వరి పంటను మూడు లక్షల 14 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు అంచనాలు రూపొందించారు. అయితే ఖరీఫ్ సాగుకు ముందు భూసార పరీక్షలు చేపట్టాల్సి ఉంటుంది. ఒక్కో సెక్టార్ పరిధిలో సుమారు 100 చోట్ల శాంపిళ్ల సేకరించి క్రోడీకరించాల్సి ఉంటుంది. నేల స్వభావం, పంటల సాగు తదితర అంశాలు ఆ సెక్టార్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకపోవడంతో ఎక్కడా చేపట్టడం లేదు.

టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేయాలి : డీఈవో



విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఎస్ఎస్సి పరీక్షల కోసం ఇప్పటి నుంచే ప్రత్యేకంగా శ్రద్ధగా చదవాలని, ఏ రోజు పాఠాలు అదేరోజు చదువుకోవాలని, అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని, సూచించారు. కష్టంగా ఉన్న సబ్జెక్టు ఎక్కువ గంటలు చదవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్ష కోసం ఈరోజు నుంచే ప్రత్యేక ప్రణాళిక వేసుకొని ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేయాలని సూచించారు. లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థినిలు ఎవరూ లేకపోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థినిల హాజరు పట్టికలు, సరుకుల రిజిస్టార్లను, తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిని ప్రగతి, ఉపాధ్యాయులు సవిత, బ్రిజారాణి, ఝాన్సీరాణి, మమత, జోష్న, శోభ, కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులతో
అక్కాచెల్లెల ఆత్మహత్యాయత్నం

- పిల్లలతో కలిసి అశోక్‌సాగర్ చెరువులో దూకిన అక్కాచెల్లెలు
- కాపాడిన స్థానికులు.. ఒక బాలుడు గల్లంతు

నవతెలంగాణ-ఎడపల్లి

కట్నం వేధింపులు తాళలేక.. ముగ్గురు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఇద్దరు అక్కాచెల్లెలు ఆత్మ హత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు.. హుటాహుటిన వారిని రక్షించగా.. వారిలో ఒక బాలుడు గల్లంతు అయ్యాడు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ శివారు అశోక్‌సాగర్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. నిజామాబాద్ 6వ టౌన్ ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం..



ఆత్మహత్యాయత్నం చేసిన అక్కాచెల్లెలు

నిజామాబాద్ నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన అక్షయ (27), నికిత (25) ఇద్దరు అక్క చెల్లెలు. వారిద్దరిలో ఒకరిని మెదక్ జిల్లా ఇబ్రహీం పూర్‌కు చెందిన వ్యక్తితో, మరొకరిని హైదరాబాద్ చెందిన వ్యక్తితో వివాహం జరిపిం చారు. వివాహ సమయంలో కట్నం కింద నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలో గల సొంత ఆస్తిని ఇద్దరు కూతుళ్లకు 200 గజాల చొప్పున రాసిచ్చారు. కొత్త కలెక్టరేట్ అయిన తర్వాత అక్కడ భూముల రేట్లు పెరిగి చుట్టుపక్కల భూములన్ని కొనుగోలు జరిగిపోగా.. అక్షయ, నిఖితలకు తల్లిదండ్రులు కట్నంగా ఇచ్చిన భూమి చుట్టూరా వెంచర్లు వెలిశాయి. అయితే వారి ప్లాట్లకు వెళ్లే దారి లేకపోవడంతో సంబంధిత ప్లాట్లు అమ్మకం జరగడం లేదు. అయితే వారి భర్తలు సంబంధిత ప్లాట్లను అమ్ముకొని వస్తేనే రావాలని కొన్ని రోజులుగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో గతవారం పుట్టింటికి వచ్చిన అక్షయ, నికిత.. తమ ప్లాట్లు విక్రయాలు జరగవని.. వేధింపులు తట్టుకోలేకపో తున్నామని తమకు చావే శరణ్యం అని శుక్రవారం ఉదయం అశోక్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యయత్నం చేశారు. అక్షయ తన కూతురు నమూ(3), నికిత తన కొడుకు భవేష్(3), కూతురు క్షేమ (1)తో కలిసి అశోక్ సాగర్‌లో దూకేశారు. అక్కడే బట్టలు ఉతుకుతున్న కొందరు అశోక్ సాగర్ రోడ్డు వెంట వెళ్తున్న మరికొందరు నీళ్లలో దూకి అక్షయ, నికిత, క్షేమ, నములను కాపాడారు. భవేష్ మాత్రం నీట మునిగి గల్లంతయ్యాడు. అతని కోసం గజ ఈతగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నలుగురు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఊర్లో క్రషర్ మిషన్ వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో గోపన్నపల్లి వాసులు
- నకిలీ సమాజసేవకర్తలను, ఎన్జీవోస్ రప్పించిన క్రషర్ యజమానులు.. నిలదీసిన గ్రామస్తులు



నకిలీ ఎన్జీవోలను నిలదీస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ధోత్రే

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద గ్రామ శివారులోని సర్వే నంబర్ 138/1 లో ఏర్పాటు చేయనున్న క్రషర్ మిషన్ కోసం పర్యావరణ సంబంధిత ప్రజా అభిప్రాయ సేకరణ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ట్రైనీ కలెక్టర్ సురేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. క్రషింగ్ మిషన్ ఏర్పాటు గోపన్నపల్లి గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల గతంలో డాంబర్ ప్లాంట్ కాలుష్యంతో గ్రామంలోని పదుల సంఖ్యలో క్యాన్సర్ వ్యాధికి గురై చనిపోయారని వివిధ వ్యాధులు సోకి అంధకారం తదితర వ్యాధులతో వికలాంగులుగా మిగిలిపోయారని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సభ్యపంలో బ్లాస్టింగ్ చేయడం వల్ల గ్రామంలోని ఇండ్లు బీటలు వారి కూలిపోయాయని, బ్లాస్టింగ్ చేయడం వల్ల దుమ్ము దూలి చుట్టుపక్కల వ్యవసాయ భూములలో చేరి పంటలు నష్టపోతున్నామని దూళి గ్రామంలోకి వ్యాపించడం వల్ల శ్వాస కోస వ్యాధులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. కూకట్‌పల్లి గ్రామానికి సమీపంలో ఇక్కడ క్రషర్ మిషన్ అనుమతి ఇవ్వరాదని ప్రస్తుతం ఉన్న క్రషర్ మిషన్ ఎత్తివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నకిలీ సమాజసేవ కర్తలను, ఎన్జీవోలను నిలదీసిన గ్రామస్తులు

క్రషర్ ప్లాంట్ నిర్వాహకులు కొందరు నకిలీ సమాజసేవ కార్యకర్తల ను ఎన్జీవో లను పిలిపించి తమకు అనుకూలంగా మాట్లాడించడంతో ఆగ్రహించిన గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ ఎదుటే వారిని నిలదీశారు. తమరి ఐడి కార్డులు చూపెట్టాలంటూ గ్రామస్తులు వారిని చుట్టుముట్టడంతో పోలీసులు జోక్యం చేసుకొని నకిలీ సమాజసేవ కార్యకర్తలను ఎన్జీవోస్ లను అక్కడి నుండి పంపించి వేశారు.

అనంతరం అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయాలను రికార్డు చేసి పర్యావరణ కంట్రోల్‌కు పంపించనున్నట్టు తెలిపారు. ఇక్కడి ప్రజలకు అన్యాయం జరగకుండా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కంట్రోల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్, ఏఈ మంజుల, తహసిల్దార్ భరత్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సాయిబాబా, సిఐ కృష్ణ, ఎస్సై శ్రీధర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

మస్కట్లో గల్ఫ్ కార్మికుడు మృతి

- విజిట్ వీసాతో మోసం చేసిన ఏజెంట్

నవతెలంగాణ-రామారెడ్డి



ఏజెంట్ మోసాలకు గల్ఫ్ కార్మికుడు మృతి చెందిన ఘటన మస్కట్లో గత శనివారం చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెల్లోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన పురం సిద్ధిరాములు (46), గత ఆరు నెలల క్రితం, ఏజెంట్ ను ఆశ్రయించి మస్కట్ దేశానికి బతుకుదెరువు కోసం వెళ్లాడు. ఏజెంటు విజిట్ వీసాపై పంపడంతో, గత ఐదు నెలల 15 రోజులు సప్లై కంపెనీలో పనిచేయగా, 15 రోజుల క్రితం వీసా లేదని, కంపెనీ బయటకు పంపియడంతో 15 రోజులు రోడ్లపై, పార్కుల్లో, మసీదుల్లో తిడి లేక ఇబ్బందులు పడుతుండడంతో, ఒక్కడి తెలుగువారు సోషల్ మీడియాలో వీడియోతో వివరాలు పంపగా, మస్కట్‌లో సదరు ఏజెంట్ గత శుక్రవారం మిత్రుల రూమ్‌కు తీసుకెళ్లారు. శనివారం ఉదయం మృతి చెందాడని ఇంటికి గురువారం సమాచారం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏజెంట్ మోసాలకు బలి అయిన గల్ఫ్ కార్మికుడి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల గల్ఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... మృతదేహాన్ని త్వరలో ఇంటికి పంపించే ప్రయత్నాలు చేస్తామని, ఏజెంట్ మోసాలను ప్రభుత్వం అరికట్టాలని, గల్ఫ్ వచ్చే కార్మికులు ఏజెంట్ల పట్ల జాగ్రత్త ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో బోధన అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి

టీపీటీఎఫ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయులను పాఠశాలల్లో సర్దుబాటు చేసే క్రమంలో పాఠశాల బోధన అవసరాలను పరిగణలోకి తీసుకోవాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్, ప్రధాన కార్యదర్శి సల్లా సత్యనారాయణ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఒక ప్రకటనలో కోరారు. బడిబాటలో కొన్ని పాఠశాలలో ప్రవేశాలు అధికంగా ఉన్నాయని, ఉపాధ్యాయ ఖాళీలు యధావిధిగా ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయ ఖాళీలు పాఠశాల బోధనకు తీవ్ర ఆటంకంగా ఉన్నాయని, పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉండి సబ్జెక్టు బోధన చేసే ఉపాధ్యాయులు లేక నష్టపోతున్నారని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్న పాఠశాలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరాల మేరకు పాఠశాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, ఎలాంటి తప్పులకు, అపోహాలుకు, రాజకీయ ఒత్తిళ్లకు అవకాశం ఇవ్వద్దని కోరారు.

లైసెన్స్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నవతెలంగాణ-సిరికొండ



మాట్లాడుతున్న ఏఈఏ ప్రదీప్

విత్తన యజమానులు లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిజామాబాద్ రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణదారులతో మండలకేంద్రంలోని రైతు వేదికలో విత్తన యజమానుల లైసెన్సులని ఆన్లైన్లో నమోదు చేయటం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ... డీలర్లు నూతనంగా ప్రవేశపెట్టిన ఓఎల్ఎంఎస్ సిస్టంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చూడాలి

ఎంపీఓ శివ చరణ్

నవతెలంగాణ-ఏర్గట్ల

వర్షాకాలం మొదలవుతున్నందున మురికి నీరు నిలువకుండా గుంతలను గ్రామపంచాయతీ సిబ్బందితో పూడ్చివేయించాలని, మురికిగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను చేయించాలని ఎంపీఓ శివ చరణ్ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. హరితహారం కార్యక్రమానికి సమయం ఆసన్నమైందని, మొక్కలు నాటే సమయానికి ప్రదేశాలను గుర్తించాలని కోరారు.

నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



దాత సహకారంతో మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నోటుబుక్స్ అందజేశారు. ఎంఈవో ఆంధ్రయ్య, సర్పంచ్ మారు శంకర్ చేతుల మీదుగా నోట్ బుక్స్ ను విద్యార్థి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ సుల్తాన్, నరేష్ గౌడ్, ఉపాధ్యాయులు సంతోష్, మాధవి, గీత, రిషిక, తదితరులు పాల్గొన్నారు.

పనులు చేసినా బిల్లులు వస్తలేవు

- సర్పంచుల ఆవేదన
- ఇరిగేషన్ అధికారిని రప్పించాలి
- పట్టుబట్టిన సభ్యులు
- జడ్పిలో నిజామాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



సమస్యను వివరిస్తున్న ప్రజాప్రతినిధి

పనులు చేసిన వాటికి బిల్లులు వస్తలేవని సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. అనూష ప్రేమ్‌నాయక్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం జడ్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సభ్యులు ఓటర్ కార్డు, రేషన్ కార్డు, భూమి సమస్యలపై లేవనెత్తారు. ఈసందర్భంగా తహసీల్దార్ అనిల్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులు ఇప్పటికీ 12వేలు ఉన్నాయని కొత్త దరఖాస్తులు వస్తున్నాయని, ఆహార భద్రత కమిషన్ వారు కూడా వచ్చి పోయారని, జూలై 1 నుండి కొత్త రేషన్ కార్డు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. బయోమెట్రిక్ విధానంలో ఏమైనా సమస్యలు ఉంటే తమను కలిస్తే పంచాయతీ సెక్రటరీ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గృహలక్ష్మి విధి విధానాలు అధికారికంగా రాగానే అందరికీ ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. తమ పరిధిలో కార్పొరేషన్‌లోని ఐదు వార్డులు ఉన్నాయన్నారు. కొన్ని లేఅవుట్ సమస్యలు కూడా ఉన్నాయని, బీసీ సర్టిఫికెట్ లక్ష రూపాయల లోన్ కోసం సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. రేషన్ కార్డులో తొలగిపోయిన పేర్లను కూడా మళ్లీ చేర్చుతామని, జులై నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్ కార్డుకు అప్లై చేసుకోవచ్చని, మొత్తం 240 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని, కొన్ని సర్వే నంబర్లలో సమస్యలు ఉన్నాయని, వీటిని కూడా పరిష్కరిస్తామని బదులిచ్చారు. ఇరిగేషన్ అధికారి రాకపోవడంతో సభ్యులు రసాభాస చేశారు ఒక సమయంలో వాకౌట్ చేస్తామని, 18 గ్రామాల సర్పంచులు ఇరిగేషన్ అధికారి రావాలని పట్టుబట్టారు. ఇరిగేషన్ అధికారితో జెడ్పీటీసీ, ఎంపిడిఓ ఫోన్‌లో మాట్లాడారు. ఆమె వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోయినట్లు సమాచారం. గాంధీనగర్‌లో కరెంటు సరిగా సప్లై కావడంలేదని, మెడికల్ కాలేజీ దగ్గర మూడు పోల్స్ కావాలని, మల్లారం దగ్గర రెండు పోల్స్ కావాలని, స్ట్రీట్ లైట్లు సరిగా వెలగడం లేదని, విద్యుత్ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. కట్టెలు సైకిల్ మీద తరలిస్తున్నారని అయినా అటవి శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. మొదటి కాన్పుకి 12వేలు రెండవ కాన్పుకు 13 వేల రూపాయలు, న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నామని, కంటి వెలుగులో కూడా 1700 మందిని గుర్తించామని, ఆపరేషన్లు చేశాం, చూపు కోల్పోయిన ఎల్వీ ప్రసాద్ లాంటి పెద్ద ఆసుపత్రిలో చూపిస్తున్నామని, కంటి ఆపరేషన్‌కోసం ఆశా వర్కర్లు ఇంటి నుండి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి మళ్ళీ ఇంటిదగ్గర దిగబడుతున్నట్టు వైద్యశాఖ అధికారి వివరించారు. ఎంపీఓ మధురిమ మాట్లాడుతూచెరువు పండుగ సంబంధించి ఖర్చుల బిల్స్ డిపిఓ కార్యాలయానికి పంపించామని అన్నారు. కానీ సభ్యులు మాత్రం చాలా బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, సొంత డబ్బులు ఖర్చు పెడుతున్నామని, ఇంతవరకు మాకు డబ్బులు రావడం లేదని తెలిపారు. ఎంపీడీవో కలుగజేసుకొని మరోసారి కలెక్టర్‌కు గుర్తు చేస్తామని చెప్పారు. ప్రతి సంఘానికి 20 లక్షల రూపాయలు రుణాలు మంజూరు చేస్తున్నామని ఐకేపీ అధికారి తెలిపారు. ఆహార ఉత్పత్తుల కింద ఎటువంటి యూనిట్ పెట్టుకున్న 35 శాతం సబ్సిడీ ఇస్తున్నామని, 10శాతం కట్టాలని, మిగతాది బ్యాంకు నుంచి రుణాలు కూడా వస్తున్నాయని అన్నారు. మల్కాపూర్ తండా నుంచి ఒక కిలోమీటర్ రోడ్డు కూడా పూర్తయిందని, గొల్ల గుట్ట నుండి మల్లారం వరకు ఎన్నో రోడ్డు మరమ్మతులు ఉన్నాయని రోడ్డు రంధ్రాలు ఉన్నాయని సభ్యులు వాపోయారు. సారంగాపూర్ నుండి జన్నెపల్లి వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయని, డబుల్ అలాగే పాల్దా నుండి తిరుమన్‌పల్లి వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తయ్యాయని ఆర్అండ్‌బీ అధికారి తెలిపారు. రూరల్ గ్రామపంచాయతీల్లో 8వేల జాబ్ కార్డులు ఉన్నాయని, దాంట్లో 3వేల మంది పనిచేస్తున్నారని, జూలై వరకు పనులు ఉంటాయని, ఇంకా కావాలంటే కనీసం 200 మీటర్లైనా ఉండాలని, నో అబ్జెక్షన్ ఉండాలని ఉపాధి అధికారి చెప్పారు. గుండారం ఎంపీటీసీ అంకం గంగాధర్ అధికారులను పలు సమస్యలపై నిలదీశారు. సమావేశంలో ఎంపీపీ అనూష ప్రేమ నాయక్, జెడ్పిటిసి సుమలత, ఎమ్మార్వో అనిల్, ఎంపిడిఓ మల్లేశం, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు

లింగి తండా పంచాయతీ భవనానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మండంలోని లింగితండ గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి సంబంధించి ఎంపీపీ అనూష ప్రేమ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ సెక్రెటరీ నిఖిత ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

152 మందిపై ఉపా కేసును ఎత్తివేయాలి

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రొఫెసర్ హరగోపాల్, న్యాయవాది ఆల్గోట్ రవీందర్ సహా 152మందిపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి శ్రీకాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ సబ్ డివిజన్ కార్యదర్శి సాయగౌడ్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్‌హరగోపాల్, కాశీం, ఆల్గోట్ రవీందర్ తదితరులు 152 మందిపై దేశద్రోహం కేసులు నమోదు చేశారన్నారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేసి, దేశద్రోహం కేసును బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ యంయల్ ప్రజా పంథా పార్టీ డివిజన్ నాయకులు మురళి, కిషన్, మోహన్, నాయకులు రాజేందర్, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్

18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు తమ తమ పేర్లను నూతన ఓటుగా నమోదు చేసుకోవాలని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా భారతీయ జనతా యువమోర్చ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, పట్టణ రూరల్ అధ్యక్షులు కలికోట ప్రశాంత్, అంకాపూర్ నరేష్, బీజేపీ పట్టణ కార్యదర్శి ఖాందేశ్ ప్రశాంత్,సాయినాథ్,కలిగోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో శుక్రవారం (ఆర్థిక అక్షరాస్యత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కామరెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ మురళీ కృష్ణ, సెర్ప్ డైరెక్టర్ సురకం శ్రీనివాస్, వెంకట్ లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలోని దాదాపు 70 మంది సిఎలను ఎంపిక చేయడం జరిగిందని, ఇలాంటి శిక్షణ లను సద్వినియోగం చేసుకోని మరింత సమాచారాన్ని ఇవ్వాలన్నారు. వెంకట్ మాట్లాడుతూ శిక్షణ యొక్క విధి విధానాలను ఈ శిక్షణను గ్రామ సంఘం సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రజితా, నవీన్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే

- రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భూపతి రెడ్డి

నవతెలంగాణ-సిరికొండ



మాట్లాడుతున్న భూపతిరెడ్డి

రానున్న ఎన్నికలలో గెలిచేది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వమే నని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు ప్రజలు గ్రహిస్తున్నారని రురల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని కేజీ దాస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బంగారు తెలంగాణ సాదించుకున్నాం అని ప్రగల్భాలు పలుకుతూ...అప్పులు కుప్పలు చేసాడని, యువత ఉద్యోగాలు లేక రోడ్ల వెంబడి తిరుగుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో తాహెర్ బిన్ హందాన్, కాటిపల్లి నగేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, భూషణ్ రెడ్డి, బాకారం రవి, ఎర్రన్న, నర్సారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



చెక్కులు అందజేసిన ప్రజాప్రతినిధులు

బాల్కొండ మండలంలోని బాల్కొండ, వన్నెల్ (బి), కిసాన్ నగర్, చిట్టాపూర్, బస్సాపూర్ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు శుక్రవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, జడ్పీటీసీ దాసరి లావణ్య వెంకటేష్ మాట్లాడుతూ.. ఏడుగురు లబ్ధిదారులకు రూ.7లక్షల 81వేల వ్యయంతో కూడిన చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌటు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, గ్రామ శాఖ అధ్యక్షులు సాగర్ యాదవ్, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్ రెడ్డి, రైతుబంధు జిల్లా సభ్యులు ఆకుల నరేందర్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం పంపిణీ



నగదు పురస్కారం అందజేసిన పద్మరాములు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకెట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ నగదు పురస్కార పంపిణీ శుక్రవారం నిర్వహించారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధర్మో ర గ్రామానికి చెందిన సదమస్తుల పద్మ రాములు నగదు పంపిణీ చేశారు. 6, 7, 8, 9వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థులకు 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, సర్పంచ్ కడారి శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-ధర్పల్లి



దరఖాస్తుదారు వివరాలు తెలుసుకుంటున్న అధికారి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బిసి కుల వృత్తులకు లక్ష రూపాయలు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20తో ముగిసిన విషయం తెలిసిందే, ఇందులో భాగంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు అయన తెలిపారు. మొదటి రోజు మండలంలోని చల్లగర్గ గ్రామంలో నేరుగా దరఖాస్తూ దారుల ఇంటి వద్దకు వెళ్లి పరిశీలన చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఐదుగురు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ 4.వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష , 5 వ సెమిస్టర్ బ్యాక్ లాక్ 7315మంది విద్యార్థులకుగాను 6690మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన యూజీ 2వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్, సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 10,006మంది నమోదు చేసుకోగా 9182 విద్యార్థులు హాజరయ్యారని, తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని పేర్కొన్నారు.

దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం - మహా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం - మహా ఉద్యమం పోస్టర్‌ను స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఓయూ రీసెర్చ్ స్కాలర్ జీవన్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, విద్యార్థి, నిరుద్యోగ ప్రజా వ్యతిరేక పాలనపై వివరించారు. తెలంగాణలో విద్యారంగంతో పాటు అన్ని రంగాలలో మార్పు కోసం జరిగే మహా ఉద్యమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఇందూరు విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ ప్రమోద్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు సాయి కృష్ణ, నాయకులు సింహాద్రి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతరం ఉద్యమిస్తే దోపిడి వర్గాలకు నిద్ర పట్టదు : సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-సిరికొండ

యువతరం శిరమెత్తితే దోపిడీ వర్గాలకు నిద్ర పట్టదని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి వి బాలయ్య అన్నారు. మండల కేంద్రంలో పివైఎల్ 8వ మండల సభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని, ఆయన అన్నారు. మోడీ, కేసీఆర్ లు అప్పులు కుప్పలుగా చేసి, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని ఆయన అన్నారు. కెసిఆర్ తెలంగాణ ఉద్యమము సందర్భంగా ఇచ్చిన హామీలు నీళ్ల మూటలుగా మారాయని వారు అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల ఎల్లయ్య, ఏఐకేఎంఎస్ నాయకులు బి గంగారెడ్డి, పిడిఎస్యు ఆర్మూర్ డివిజన్ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఫ్రైడే డ్రై డే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో డెంగ్యూ, మలేరియా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను తొలగించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు చుట్టూ ఉండే పరిసరాల్లో ఏర్పడి దోమలు వృద్ధి చెంది డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. అప్రమత్తంగా ఉంటూ ఇంటి పరిసరాలలోని కొబ్బరి చిప్పలు, పాత కూలర్లు, పాత బకెట్లు ఎప్పటికప్పుడు తొలగించుకోవా లన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయి, పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్త ఆనంద్, ఆశాలు పాల్గొన్నారు.

మినీ సోయా బస్తాల పంపిణీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలానికి మంజూరైన 18 క్వింటాళ్ల సోయా మినీ కిట్ల బస్తాలను పట్టా పాస్‌బుక్ కలిగిన ఒక్కొక్క రైతుకు 8 కిలోల సోయా బస్తాను పంపిణీ చేస్తున్నట్టు ఏవో లావణ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని దొనకల్ క్లస్టర్ రైతులకు బాసర రకం సోయా విత్తనాలను ఏడిఏ మల్లయ్య ఉచితంగా పంపిణీ చేశారు. పట్టా పాస్ బుక్ ఒక యూనిట్‌కు 8 కిలోల సోయా బస్తాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఏఈఓ అనుమతి పొంది సోయ విత్తనాలను పొందాలని తెలిపారు. కార్యక్రమంలో షట్పల్లి సహకార చైర్మన్ రాజేశ్వర్, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఎవరికోసం..?

- సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-ఆర్మూర్

కేసీఆర్ ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాల్లో తెలంగాణ బిడ్డలకు చేసిందేమిటని, దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా సంపదను దుబారా చేస్తున్నారని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు అన్నారు. పట్టణంలో మామిడిపల్లిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ అనంతరం దాసు మాట్లాడుతూ.. విద్యార్థి, యువత త్యాగాలతో పురుడు పోసుకున్న తెలంగాణా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ పేరుతో, అవినీతి, అప్పుల తెలంగాణగా కేసీఆర్ మార్చారని తెలిపారు. 72,000 కోట్ల అప్పునుండి 5 లక్షల కోట్ల అప్పుకు పెంచి, కమిషన్ల కంపెనీగా మార్చాడనీ, తెలంగాణ ద్రోహులతో పరిపాలన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాలపేరుతో ప్రజల్ని మభ్యపెట్టి మోసం చేశారని ఆయన అన్నారు. ఉపా చట్టాలను అమలు చేస్తూ ప్రశ్నించే గొంతులను జైల్లలో నిర్బంధించాలని చూస్తున్నారనివా వాపోయారు. రైతు రుణమాఫీ వెంటనే ఏకకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హరితహారం పేరుతో పేదల భూములను గుంజుకొని, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని చేస్తున్నారని, కబ్జాలకు పాల్పడి ప్రజాప్రతినిధులు వందల ఎకరాల భూములకు అధిపతులు అయ్యారని ఆయన తెలిపారు. కేసిఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దాసు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి. సూర్య శివాజీ, పివై ఎల్ యస్‌రవి, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షులు రాగుట్ట బాబురావు, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మణెమ్మ, ధనలక్ష్మి, పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ గంగాధర్, పివైఎల్ ఆర్మూర్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, పర్సఅనిల్, తదితరులు పాల్గొన్నారు.

మలేషియా జైలునుండి స్వగ్రామానికి చేరిన యువకుడు

- కోటపాటి సహకారంతో..

నవతెలంగాణ-ఆర్మూర్

మలేషియా జైల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన యువకుడు ఉండడంతో మై గ్రాండ్స్ రైట్స్ వెల్ ఫర్ ఫోరం అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు మలేషియా తెలుగు సంఘం సహకారంతో ఇండియాకు రప్పించారు. ఆరు నెలల క్రితం కామారెడ్డి జిల్లా శాబ్దిపూర్ లంబాడి తండా యువకుడు బాదావత్ గణేష్ తమ దగ్గరి బంధువు మలేషియా నుండి విజిట్ వీసా పంపించి సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఉందని చెప్పి లక్ష రూపాయలు తీసుకొని మోసగించాడు. దీంతో అక్కడి పోలీసులకు పట్టుబడి ఆరు నెలలు జైలు జీవితం గడిపి శుక్రవారం ఇండియాకు చేరుకున్నాడు. మాక్లూర్ మండలం, నిజామాబాద్ కార్పొరేటర్ రాజాసింగ్ చొరవతో కోటపాటి నరసింహం నాయుడును కలిసి తమ సమీప బంధువు బదావత్ గణేష్ ను ఎలాగైనా ఇండియాకు రప్పించాల్సిందిగా కోరాడు. కోటపాటి వెంటనే స్పందించి, మలేషియాలోని ఇండియన్ ఎంబసి, అక్కడి మలేషియా తెలుగు ప్రవాసి సంఘం ఉపాధ్యక్షుడు కంచర్ల ఆనంద్ కు వివరాలు పంపి గణేష్ ను ఇండియాకు పంపే ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరారు. వారు గణేష్‌ను ఇండియాకు పంపించడంలో సహకరించారు. కోటపాటి స్వయంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు వెళ్లి గణేష్‌ను రిసీవ్ చేసుకున్నాడు. ఆయనతోపాటు రాజసింగ్, కుటుంబీకులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- నేడు నియోజకవర్గంలో మంత్రి పర్యటన

నవతెలంగాణ-ముప్కాల్

నేడు బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన (కేజీబీవీ) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. బాల్కొండ మండల కేంద్రం నుంచి కిసాన్ నగర్ గ్రామం మీదుగా ముప్కాల్ మండల కేంద్రం వరకు బీటీ రోడ్డుకు రూ.1.35 లక్షల రూపాయలు మంజూరు s నిర్మాణ పనుల కు కిసాన్ నగర్ గ్రామంలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

నిబంధనలను పాటించని విద్యాసంస్థలను సీజ్ చేసి వాటి గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారాంకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడుపుతూ సుప్రీంకోర్టు జీవో 91 విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్- ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ బుక్స్, టై, బెల్టు విక్రయిస్తూ ఇలా పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చారని అన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలు పాటించని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేసి వాటి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటేఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

స్టార్టర్ దొంగిలించిన గుర్తు తెలియని వ్యక్తులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామపంచాయతీకి సంబంధించిన బోరు మోటర్ డబ్బాలోని స్టార్టర్, ఆటోమెటిక్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ తెలిపారు. ప్రజలకు తాగునీటి అందించే ఈ మోటారు నడవకపోవడంతో వాటర్‌మెన్ వెళ్లి చూడగా డబ్బలో పరికరాలు దొంగతనం జరిగినట్టు తెలియడంతో వెంటనే సర్పంచ్‌కు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి రాజేందర్ రావుతో పాటు సర్పంచ్ ఘటనా స్థలానికి విచ్చేసి పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిజైన్, టెక్నాలజీ కోర్స్ ప్రవేశాల దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

వేములవాడ పట్టణం, శాత్రజిపల్లి రోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం 2023-2024 విద్యా సంవత్సరం బీఎస్సీ డిజైన్, టెక్నాలజీ కోర్స్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ జూన్ 28న ముగియనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) ప్రిన్సిపల్ డా.వి.రాధిక ప్రకటించారు. ఈ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఇంటర్, వొకేషనల్ (సీజీటీ) పూర్తి చేసిన విద్యార్థినులు, ఫ్యాషన్ రంగంలో ఆసక్తిగలవారు దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 7675897485, 9059663002 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బిర్మల్ తండా గ్రామపంచాయతీ నిర్మాణానికి ఎంపీపీ రాధా బలరాం, జెడ్పీటీసీ సభ్యుడు శంకర్ నాయకులతో కలిసి స్థానిక సర్పంచ్ గోతి ధర్బర్ గ్రామపంచాయతీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధా బలరాం, జెడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, వైస్ ఎంపీపీ భజన్‌లాల్, బిర్మల్‌తండా సర్పంచ్ గోతి దర్బార్, ఉపసర్పంచ్ సీతారాంనాయక్, బీఆర్ఎస్ నాయకులు తండా పెద్ద నాయకులు తండాప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రయివేట్ పాఠశాలలకు నోటీసులు జారీ

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లాలో అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, అశోక్‌నగర్ కాలనీలో ఉన్న హైటెక్ పబ్లిక్ స్కూల్‌కు అనుమతి లేదని తెలిపారు. అలాగే వివేకానంద, కృష్ణవేణి, క్యాండీ, కాకతీయ, అభ్యాసా, గౌతమ్, హర్ష ప్రైవేట్ పాఠశాలలకు ఉన్న తోక పేర్లను తొలగించాలని ఆయా ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. అలాగే కాకతీయ, అభ్యాసా ప్రైవేట్ పాఠశాలలో సీబీఎస్ఈ అనుమతి లేదని, అనుమతులు ఉన్నట్లు విద్యార్థులను మోసం చేసి అడ్మిషన్లు తీసుకుంటే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వికలాంగులకు ఫిజియోథెరపీ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో లింగంపేట్ మండలంలో వికలాంగులు గల పిల్లలకు వైద్య శిబిరాన్ని మండల విద్యాధికారి ఆధ్వర్యంలో డాక్టర్ సాయికృష్ణ గౌడ్ ఫిసియోతేరఫీని శుక్రవారం నిర్వహించారు. ఎనిమిది మంది వికలాంగులకు ఫిజియోథెరపీ చేశారు. వారి తల్లిదండ్రులకు తగిన సూచనలు ఇచ్చారు. ఫిజియోథెరపీ చేయడం వల్ల వికలాంగుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. వారవారం వికలాంగులకు ఫిజియోథెరపీ చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల ఉపాధ్యాయురాలు శ్యామల, అశ్విని, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణాజివాడిలో అంతర్జాతీయ వితంతు దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో అంతర్జాతీయ వితంతు దినోత్సవాన్ని మాళవికాస ఆధ్వర్యంలో వితంతు వివక్షత విముక్తి ఉద్యమ సమైక్య స్ఫూర్తితో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస అధ్యక్షుడు ఏనుగు నరసింహారెడ్డి, సర్పంచ్ జంగం భూషణం, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, గిరి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ యూత్ గ్రామ అధ్యక్షులు బండమీది అరవింద్, పద్మశాలి సంఘం మండలాధ్యక్షులు గుజరాజు, బాలవికాస సభ్యులు కళ్ళరాజురెడ్డి, గద్దె రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి ఆపరేషన్‌కు సిద్ధమైన పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు హరికిషన్ 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 12మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. కాగా 18 మందికి కంటి అద్దాలు అవసరమున్నట్టు గుర్తించినట్లు ఆయన తెలిపారు.లయన్స్ క్లబ్ మండల ప్రెసిడెంట్ రమణ, డాక్టర్లు రోహిత్ కుమార్, శివకుమార్, సమద్, సిబ్బంది సిద్ధి రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్మల్లలో బోరుడ్రిల్లింగ్

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని పర్మల్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి బోరు తవ్వకాన్ని ప్రారంభించినట్టు సర్పంచ్ పరువయ్య తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో బోరు బావి లేదని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలగడంతో ఈ విషయాన్ని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి పర్మల్ల గ్రామం ప్రాథమిక పాఠశాలకు బోరు మంజూరు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వయ్య, ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేగ్గేల రాజు, కుమ్మరి అశోక్, చాకలి ఆశయ్య, శ్రీనివాస్‌గౌడ్, ప్రభురాజు, సాయిలు, శ్రీనివాస్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్షలు వాయిదా

- తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్. అరుణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ కి చెందిన (YIPGP APE/IPCH) 8వ,10వ సెమిస్టరు రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు జులై 04 నుంచి 14వరకు జరగాల్సి ఉండగా సిపి జీఈటీ - 2023 ప్రవేశ పరీక్ష దృశ్యా పరీక్షలను వాయిదా వేసినట్టు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్. అరుణ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.తిరిగి పరీక్షల నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని సిఓఈ పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులు ఈ విషయం గమనించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్ సైట్ సంప్రదించాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం వైర్లు తగిలి షార్ట్‌సర్క్యూట్

- ఇంటి సామగ్రి నష్టం

నవతెలంగాణ-రామారెడ్డి



విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలు

ప్రజలకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని అన్నారం గ్రామంలో విద్యుత్ సరఫరా చేసే లైన్లకు చెట్టుకొమ్మలు ఆనుకుని ఉండటంతో గురువారం రాత్రి 8 గంటలకు విద్యుత్ లైన్‌కు చెట్టుకొమ్మలు తగలడంతో, విద్యుత్ లైన్లు ఒకదానికి ఒకటి అనుకొని మంటలు చెలరేగాయి. దీంతో సుమారు 15 ఇండ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ పరికరాలు పనికి రాకుండా పోయాయి. 15 ఇండ్లలో దాదాపు రెండు లక్షలు వరకు ఆస్తినష్టం వాటిల్లిందని కాలనీవాసులు విద్యుత్ అధికారులపై మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలవకుండా, విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే విద్యుత్ అధికారులపై కోర్టులో ఆస్తి నష్టం దావా వేస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల మార్పు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోగల డిగ్రీ బిఏ, బీకాం, బిఎస్సీ, బీబీఏ, కోర్సులకు చెందిన 2వ 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీలను మార్పు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ శుక్రవారం రీషెడ్యూల్‌ను విడుదల చేశారు. డిగ్రీ 2వ,4వ,6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు సెట్-1, గ్రూప్Aకి సంబంధించిన కళాశాలల్లో జులై 18 నుంచి 23 వరకు జరుగుతాయని తెలిపారు. గ్రూప్ బి కి చెందిన కళాశాలల్లో జులై 26 నుంచి ఆగస్టు 01 వరకు, అదే విదంగా స్టాటస్టిక్స్ ప్రాక్టికల్ / ప్రాజెక్టు ఎగ్జామినేషన్ పరీక్ష సెట్-2లో గ్రూప్ -ఎ కి చెందిన కళాశాలల్లో జులై 24,25 తేదీల్లో జరుగుతుందని పేర్కొన్నారు. గ్రూప్ 'బి' కి చెందిన కళాశాలల్లో ఆగస్టు 02, 3 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు www.telangauniversity.ac.in వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/మద్నూర్/బోధన్

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా శుక్రవారం వారి చిత్రపటానికి బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి బాణాల లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవేందర్, పట్టణ అధ్యక్షులు సతీశ్, రూరల్ అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, నాయకులు నరేష్, శంకర్, సాయికిరణ్, ప్రశాంత్, ఐటీ సెల్ రవి, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ 9సంవత్సరాల పరిపాలన పూర్తి అయిన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఎల్లారెడ్డి పట్టణంలోని పోలింగ్ బూత్ 244, 246లో ఇంటింటికీ తిరుగుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి బాణాల లక్ష్మారెడ్డి వివరించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, ఎస్.ఎన్.రెడ్డి, మంగలి సతీష్, కుర్మ సాయిబాబా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్నూర్ : మండల కేంద్రంలోని బీజేపీ మండల శాఖ కార్యాలయంలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షులు బి.హను మాన్లు మాట్లాడుతూ.. శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్దామని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ బలిదాన్ దివస్ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు బి.హన్మండ్లు, చాట్ల హన్మాండ్లు, జనరల్ సెక్రటరీ, తెప్పవార్ తుకారాం, కె.యాద వ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు పలకలు పంపిణీ..

బోధన్ : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బోధన్ పట్టణంలోని 35, 37 వార్డులలో గల అంగన్వాడీ కేంద్రాలకు బీజేపీ జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి పలకలు, బలపాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, సాక్రే శివకుమార్, కటికల మోహన్, బింగి సాయికుమార్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జవాన్లకు కనీస వేతనం అమలు చేయాలి

- బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వాటర్ సప్లై గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్ ఔట్సోర్సింగ్ జవాన్ల కనీస వేతనం అమలు చేయాలి అని రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన మున్సిపల్ వాటర్ సప్లయ్ గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, మంచినీళ్ళు అందించ డానికి పనిచేసే మున్సిపల్ కార్మికులకు, పారిశుధ్యం, వాటర్ సప్లయ్, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, ఫిల్టర్ బెడ్స్, సూపర్ వైజర్స్, బిల్ కలెక్టర్స్, డ్రైవర్స్, ఆఫీస్ తదితర స్టాఫ్ సెక్షన్‌లలో ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై త్వరలో ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బి ఎల్ టి యు) జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, బిఎల్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కాంబ్లే మధు, నగర అధ్యక్ష, కార్యదర్శులు గంగా శంకర్, యాదయ్య, నాయకులు రాహుల్, హరీష్, మురళి, వసంత్, శ్రీశైలం శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఒక్కసారైనా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించావా?

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యేగా హనుమంత్ షిండే వరుసగా మూడుసార్లు గెలిచినా.. ఒక్కసారైనా మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించిన దాఖలాలు లేవని, 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తానని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని బీజేపీ మండలాధ్యక్షులు బి.హనుమాన్లు విమర్శించారు. శుక్రవారం బీజేపీ మండల శాఖ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు బి.హనుమాన్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని హాస్టల్లో ఉంటూ ఇక్కడే 10వ తరగతి వరకు చదువు నేర్చానని ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నా. ఇచ్చిన ఏ ఒక్క హామీలు నెరవేర్చడం లేదని ఆయన ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు. సమావేశంలో నాయకులు వెంకట్ కాలే, కంచిన్‌వార్ యాదవరావు పాల్గొన్నారు.

బృహత్, పల్లె ప్రకృతి వనాలలో పిచ్చిమొక్కలు తొలగించాలి

నవతెలంగాణ-పిట్లం

బృహత్, పల్లె ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ పరిధిలోగల బృహత్ పల్లె ప్రకృతి వనంలోని చెట్లకు నీరు పట్టించి వాటరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బృహత్, పల్లె ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలు అధికంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు గానూ పంచాయతీలు ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను తొలగింపు కార్యక్రమాలతో పాటు ఆహ్లాదకరంగా పెంచేటట్లు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికలోని పదాలను తొలగించడం అవమానకరం

- డీటీఎఫ్

నవతెలంగాణ-తాడ్వాయి

రాజ్యాంగ పీఠికలోని పదాలను తొలగించడం అవమానకరమని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులా గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి తెలుగు, ఇంగ్లీషు మీడియం సాంఘిక శాస్త్రం కవర్ పేజీ ప్రచురించిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రచురణలో సోషలిస్టు, లౌకికవాదం పదాలను తొలగించడం రాజ్యాంగాన్ని అవమాన పరచడమేనని పేర్కొన్నారు. 1976, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సోషలిస్టు, లౌకిక పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారని తెలిపారు. ప్రచురించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మండలంలోని హాజీపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంపీపీ పాల్త్య విఠల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులకు, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నదని గత ప్రభుత్వాలలో భవనాలు కూడా సరిగా లేకపోయేవని స్వరాష్ట్రంలో అద్దాల్లా భవనాలు నిర్మించుకున్నామని తెలిపారు. జడ్పీటీసీ జన్నుబాయి, ప్రతాప్‌సింగ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మజీద్, స్థానిక సర్పంచ్ అరిగే సాయిలు, సొసైటీ అధ్యక్షుడు గంగారాం, ఎంపీటీసీ నారాయణరెడ్డి, ఐసీడీఎస్ అధికారులు కళావతి, వాణి, సాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

- తహసీల్దార్ రామచందర్‌కు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన మైనర్ బాలికపై ఈనెల 19న రవి అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడగా.. అతనిని కఠినంగా శిక్షించాలని మండలంలోని జిమియత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సహకరించాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ హైస్కూల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను పాఠశాల చైర్మన్ నన్నేసాబ్ విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాలలో తెలుగు బోధనతోపాటు ఆంగ్ల బోధన కొనసాగుతుందని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. మన ఊరి పిల్లలు మన ఊరిలోనే చదువుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, ఉపాధ్యాయులు జరీనా, ప్రసన్నలక్ష్మి, సృజన, శుభాంగి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విద్యానగర్ కాలనీలో రోడ్డు కబ్జా చేసి ఇల్లు నిర్మాణం చేస్తున్న ప్రదేశంలో శుక్రవారం కాలనీవాసులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ టిపిఓను పిలిపించి డాక్యుమెంట్లను చూపించారు. అక్రమ కట్టడాన్ని కూల్చివేసి రోడ్డు నిర్మాణం చేయాలని కాలనీ అధ్యక్షులు యామాద్రి భాస్కర్, కార్యదర్శి పృథ్వీరాజ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగాధర్, గిరి, భూమేశ్వర్, శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లి సొసైటీకి యూరియా రాక

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి ప్రాథమిక సహకార సంఘానికి 40.50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని అన్నారు. సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు యూరియాను తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : పీవైఎల్

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 25న జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో జరిగే పివైఎల్ జిల్లా 8వ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఎస్. రవి యువతను కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థి, యువత తమ ప్రాణాలను పణంగా పెట్టిన విషయాన్ని నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని, ఉద్యోగ భర్తీలు చేయకుండా యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పి.వై ఎల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకటేష్, పి అనిల్, నాయకులు సమీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి

• మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-మద్నూర్

బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దేగ్లూర్‌కు చెందిన పవన్, శ్యామ్ ద్విచక్రవాహనంపై వచ్చి తిరుగు ప్రయాణంలో 161 వ జాతీయ రహదారి గుండా వెళుతుండగా మండలంలోని రుశేగావ్ గ్రామం వద్ద గురువారం బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా పవన్ ( ) అనే వ్యక్తి మార్గమధ్యంలో మృతిచెందాడ. శ్యామ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డికా కుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు



నవతెలంగాణ-బోధన్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని కోరుతూ బోధన్ పట్టణంలోని రెడ్డికా కుల సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను శుక్రవారం నిర్వహించారు. ఈ బోనాలు డప్పుచప్పుళ్లతో సంఘం భవనం నుంచి ప్రారంభమై మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతుల పంటలు పుష్కలంగా పండాలని వారు గ్రామ దేవతలను కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రుద్ర సత్యనారాయణ, రెడ్డికా కుల సంఘం ముఖ్య నాయకులు గుమ్మల అశోక్‌రెడ్డి, మహిళలు, యువకులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఐక్యవేదిక బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పెద్దిసూరి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సంఘాల ఐక్యవేదిక బహిరంగ సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ సిపిఎం ఏరియా కార్యదర్శి పెద్ది సూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాటాలను సందర్శించుటకు ఈనెల 18న ప్రారంభమైన ప్రజా సంఘాల ఐక్యవేదిక బస్సుయాత్ర ఈనెల 24న నిజామాబాద్ రానున్నదేని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇండ్లు , ఇండ్ల స్థలాలకు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న బాధిత ప్రజలతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది సూరి మాట్లాడుతూ.. నగర పార్టీ ఆధ్వర్యంలో స్థానిక దుబ్బ ప్రాంతంలో నెల రోజుల క్రితం ప్రారంభమైన భూ పోరాట ప్రజలు, ఇప్పటికి ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇండ్లలో బతుకులు ఈడుస్తున్న ప్రజలందరూ ఈ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాల్లో మార్పు రావట్లేదని, ప్రజల పక్షాన పని చేసిన ప్రభుత్వాలే కరువయ్యాయని అన్నారు. ముఖ్యంగా నివాస స్థలాలు లేక అనాథల్లా ప్రజలు బతుకుతున్న పరిస్థితి మన దేశంలో, రాష్ట్రంలో దాపరించిందని అన్నారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ దిశగా సిపిఎం పార్టీ ప్రజలను ఏకం చేసి పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్, బెజగం సుజాత, పి మహేష్, కటారి రాములు, నగర కమిటీ సభ్యులు, ధ్యారంగుల కృష్ణ, అనసూజమ్మ నల్వాల నర్సన్న, పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతే టీఎన్జీవోల ముఖ్య ఉద్దేశం

• ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ టీఎన్జీవోఎస్ జిల్లా

• అధ్యక్షులు అలుక కిషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉద్యోగుల భద్రతే టీఎన్జీవోల ముఖ్య ఉద్దేశమని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలు అద్భుతంగా ఏర్పాటుచేసి నిర్వహణకు కృషిచేసిన ప్రతి అధికారికి, ఉద్యోగులకు ఉద్యమాభి నందనలు తెలిపారు. తొలి, మలి ఉద్యమంలో అమరులైన విద్యార్థి, ఉద్యోగులందరికీ ఘనమైన నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అమరవీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అమర జ్యోతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. స్వరాష్ట్రంకోసం, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో ప్రాముఖ్య తమైనదని తెలిపినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు రావలసిన రెండు విడతల కరువు భత్య ం(డిఎ), పీఆర్‌సిని అమలు చేస్తూ త్వరి తగ తిన మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించ ాలని, ఉద్యోగు లకు మెరుగైన చికిత్స నిమి త్తం కార్పొరేట్ వైద్యం అ వ ం ల ం క ా ం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ని పటిష్టంగా అమలు చేయుటకు విధి విధానాలను ప్రకటించాలని అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సిపిఎస్) రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బదిలీ విషయంలో భార్యాభర్తల బదిలీలు, చాలా కాలంగా బదిలీలు లేని సాధారణ బదిలీలు వెంటనే అమలు ఉత్తర్వులు ఇవ్వాలని, వివిధ శాఖలో గల పోస్టులను వీఆర్వోల భర్తీతో సంపూర్ణం కాగా జిల్లాలో గల 56 పెండింగ్ కారు ణ్య నియామకాలను గాను సూపర్ న్యూమరీ పోస్టులు కల్పి ంచి నియామకాలు చేసేం దుకు ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మామిళ్ళ రాజేందర్ అధ్యక్షతన ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. దీనిపై సముచిత ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ సంఘం అమృత్ కుమార్, సలహాదారులు ఆకుల ప్రసాద్, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, సతీష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, జాఫర్ హుస్సేన్, కాసాని శ్రీనివాస్, సత్యం, సంజీవయ్య నటరాజ్ గౌడ్, ఉమా కిరణ్ అర్చన్, రూరల్ యూనిట్ల అధ్యక్షులు సుమన్ కుమార్, దినేష్ బాబు, క్లాస్ ఫోర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజ్మీర రాంజీ, గొండ స్వామి తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోఎస్ అధ్యక్షులు అలుక కిషన్

బస్వాయిపల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పెర్క శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండల పరిధిలోని బస్వాయిపల్లి గ్రామం నుంచి చౌటకుంట చెరువు వరకు రోడ్డు పనులకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామానికి ఉన్న ఒక్క చెరువు కట్ట, వ్యవసాయ రైతులకు రోడ్డు సక్రమంగా చేయలేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారని, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉన్న సమస్యలను వివరించడంతో వెంటనే నిధులు మంజూరు చెయ్యడంతో పనులకు భూమిపూజ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మెంబర్ మజీద్, సర్పంచ్ రెహన్, నాయకులు తదితరులున్నారు.

బ్రాహ్మణ సంఘం భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులో బ్రాహ్మణ సంఘం భవనానికి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి సంఘానికి స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ సంఘం భవనాలకు రూ.10లక్షల నిధులు మంజూరు చేశారని, కొన్ని సంఘాల నాయకులు ఇప్పటికే భవనాలు ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్స్, పద్మ శ్రీకాంత్, నీలకంఠం, ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, బ్రాహ్మణ సంఘం నాయకులు కొండం బొట్ల రాజు, సురేందర్, శ్రీనివాస్, నరసింహారావు, బ్రాహ్మణ సంఘం పురోహితులు, ప్యాలల రాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలోని పదో వార్డులో 12 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కుడుమల సత్యనారాయణ, పదవ వార్డు కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్డు డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్టు వివరించారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి చేయడమే స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ లక్ష్యమని, త్వరలోనే అన్ని వార్డుల్లో పనులు ప్రారంభిస్తామని అన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, లక్ష్మణ్, రాములు, సద్దుల, శ్రీరామ్, మేస్త్రి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మరణించిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్ గౌడ్ వివరాల ప్రకారం.. భిక్కనూర్ పట్టణానికి చెందిన కమ్మరి శ్రీనివాస్ (40) వడ్ల పని చేస్తూ జీవిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి సరిగ్గా పని చేయక, కుటుంబాన్ని పోషించలేక, తాగుడుకు బానిసై మూడు రోజుల క్రితం మద్యం సేవించి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు భిక్కనూర్ పట్టణ కేంద్రంలో గల బొబ్బిలి చెరువులో కాలుజారి ఈతరాక మరణించాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన కోసం రూ.5వేలు విరాళం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన కోసం లింగాయత్ సమాజ్ కుల పెద్దలు ప్రముఖుల దగ్గర చందా రూపంలో సహకారం కోరుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం మద్నూర్ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యదర్శి జే బాబురావు విగ్రహ ప్రతిష్టాపనకు రూ.5వేలను చంద రూపంలో కుల పెద్దలకు అందజేశారు. ఏండ్ల తరబడి విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాటు పెండింగ్‌లో ఉండటం సరైంది కాదని, విగ్రహ ప్రతిష్టాపన కోసం రూ.5వేలు అందజేయాలని సింగిల్ విండో కార్యదర్శి జే బాబురావుకు లింగాయత్ సమాజ్ పెద్దలు కోరడంతో ఆయన రూ.5వేలు చందా రాసిన కార్యదర్శికి సమాజ్ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో శంకర్రావు, మారుతి పటేల్, శివాజీ అప్ప పాల్గొన్నారు.

పండ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ



మనసిక వికలంగులకు పండ్లు పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శుభోదయం పాఠశాలలోని మానసిక వికలాంగులకు మండల కేంద్రానికి చెందిన మాస్టర్ చింతలపల్లి అభిరామ్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వికలాంగుల పిల్లలకు పండ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్టు వికలాంగుల సిసి శ్రీరామ్ తెలిపారు. అభిరామ్‌రెడ్డి తాతలు చింతలపల్లి పెద్ద గంగారాం, నారెడ్ల సాయిరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం

• ధర్మపురి సంజయ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే నాగారం 13 డివిజన్ సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని ధర్మపురి సంజయ్ తెలిపారు. నిజాంబాద్ అర్బన్ పరిధిలోని నాగారం పదవి డివిజన్ వాసులతో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ధర్మపురి సంజయ్ శుక్రవారం నాగారం 10వ డివిజన్ వాసులతో చర్చా వేదిక ఏర్పాటుచేశారు. కాలనీ వాసులతో వారి సమస్యలను, ఇబ్బందులను, అధికార పార్టీ మోసాలను నీటి సమస్యలను, రోడ్ల సమస్యలను, పరిసర ప్రాంత పరిశుభ్రత సమస్యలు, మురికి కాలువలు, విద్యుత్, వీధి కుళాయిలు, వీధి దీపాలు, శ్మశాన వాటిక, నీటి కొరత, ఇళ్ల పట్టాలు వంటివి సంజయ్ దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఏ విధంగా గెలిచిన నాటి నుంచే అమలుచేస్తుందో అదేవిధంగా అందరి సమస్యలరను కాంగ్రెస్ అధికారంలో కి వచ్చిన సంవత్సరంలొనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి అన్ని ప్రాంతాలు నగరాలు, పట్టణాల అభివృద్ధికి కారణమవ్వాలని, అండగా ఉండి మీకోసం పోరాడుతానని హామీ ఇచ్చారు.

ఘనపురం దేవేందర్‌కు సత్కారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభలలో జిల్లాకు చెందిన కవి, రచయిత, ఉపాధ్యాయుడు, పరిశోధకులు, వ్యాఖ్యాత ఘనపురం దేవేందర్ కు శాసన మండలి సభ్యులు, భారత జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు. సభల నిర్వహణలో తెలంగాణ సాహిత్య అవలోకనం సదస్సు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణ రేడియో రూపకం అనే అంశంపై పత్ర సమర్పణ చేసిన ఘనపురం దేవేందర్‌ను శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. నిజామాబాద్ వేదిక ద్వారానే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ ఘనపురం దేవేందర్ గొప్పగా రాణిస్తున్నాడని శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ అభినందించారు. పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు. ఈ తెలంగాణ సాహిత్య సభలు హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆచార్య రవ్వా శ్రీహరి ప్రాంగణంలో, ఆచార్య బాల శ్రీనివాసమూర్తి వేదికన ఈనెల 21 22న జరిగాయని తెలిపారు

నవోదయకు విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థిని సాహిత్య శ్రేష్ఠ (జవహర్ నవోదయ)కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ భూస రత్నాకర్, ప్రిన్సిపాల్ చంద్ర విలాస్ లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చంద్ర విలాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటవస్తువులు పంపిణీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులకు పాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆట వస్తువులు, నోట్ బుక్స్ లు పంపిణీ చేశారు. వీటిని పంపిణీ చేసిన శ్రీనివాస్‌ని మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య అభినందించారు. కార్యక్రమంలో భవిత విద్యా వనరుల ఉపాధ్యాయులు సీఆర్పిలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలపై 26న చలో నిజామాబాద్

• జీపీ కార్మికుల జేఏసీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న చలో నిజామాబాద్ కార్యక్రమం తలపెట్టినట్టు గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ పిలుపు వచ్చింది. శుక్రవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతి కార్మికుల వేతనాలు పెంచి పెర్మనెంట్ చేయాలని ఈనెల 26 రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేష్ గంగాధర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. కాజా మొయినుద్దీన్, జేపీ గంగాధర్ పంచాయతి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈనెల 17న రాష్ట్ర పంచాయతీ కమిషనర్‌ను రాష్ట్ర జేఏసీ నాయకత్వం ఆధ్వర్యంలో కలిసి కార్మికుల సమస్యల్ని వివరించడం జరిగిందని దాసు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 50 వేల కార్మికుల్ని వెంటనే క్రమబద్ధీకరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు కట్టాలని వారు డిమాండ్ చేశారు. మోడీ తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీ తీర్మానం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే జులై 6 నుండి నిరవధిక సమ్మెకు దిగవలసి వస్తుందని రాష్ట్ర జేఏసీ నిర్ణయించిందని తెలిపారు. చలో నిజామాబాద్‌లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, భానుచందర్, చొప్పరి గంగాధర్, సిఐటియు నాయకులు సాగర్, గంగారాం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజల సమస్యలు తెలిసిన పార్టీ.. కాంగ్రెస్

• పల్లెపల్లెకూ కాంగ్రెస్.. గడపగడపకూ మదన్ మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

ప్రజల సమస్యలు తెలిసిన పార్టీ.. కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకరావడమే తన లక్ష్యమని మదన్ మోహన్ తెలిపారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లి, దేవునిపల్లి గ్రామంలో పల్లెపల్లెకూ కాంగ్రెస్.. గడప గడపకూ మదన్ మోహన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాడవాడ తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు అరిఫ్, మదన్ మోహన్ యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ..

లింగంపేట్ : మండలంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్‌రావు పలు కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. మెంగారం గ్రామానికి చెందిన తంత్రి గణేష్ తండ్రి తంత్రి నాగభూషణం ఇటీవల మరణించగా వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన మంగలి రాములు (పంతులు) ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటానని కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నల్లమడుగు షరీఫ్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నారాగౌడ్, లింగంపేట్ వార్డు సభ్యులు మంద ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు సాయిరాం, మంగళి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో గడప గడపకు కాంగ్రెస్‌లో మదన్ మోహన్

జీవన్‌రెడ్డిని గెలిపిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చర్ల సాగర్

• నందిపేట్ గ్రామ నాయకుల తీర్మానం

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ... పట్టణంలోని ప్రతి 60 ఓట్లకు ఒక ఇన్చార్జిని నియమించామన్నారు. మొత్తం 160మంది క్రియాశీల కార్యకర్తలని పట్టణంలో ఇన్చార్జిలుగా నియమించడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నందిపేట గ్రామంలో 80 శాతం ఓట్లు కారు గుర్తుకు వేసి జీవన్ రెడ్డిని గెలిపిస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో 4000 ఓట్ల మెజార్టీని సాధించేలా ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నాయకత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నందిపేట మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, జెడ్పిటిసి ఎర్రం యమునా ముత్యం, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీ మురళి, బజరంగ్ చవాన్ సీనియర్ నాయకులు ఉల్లి శ్రీనివాస్ గౌడ్, సిలిండర్ లింగం, చెక్ చెక్ ముత్యం, బాలగంగాధర్ మజారుద్దీన్ హుస్సాముద్దీన్, నందిపేట్ పట్టణ అధ్యక్షుడు కొత్తూరు భాస్కర్, ఉప సర్పంచ్ భరత్, వార్డు మెంబర్లు, మైనార్టీ అధ్యక్షుడు పాషా, యూత్ అధ్యక్షుడు దినేష్, యువజన విభాగం నాయకులు వినయ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగులకు అన్నిరంగాల్లో ప్రోత్సాహకాలు అందించాలి

• తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మోపాల్

వికలాంగులకు అన్ని రంగాల్లో ప్రోత్సాహకాలు అందించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసదర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి మాట్లాడుతూ.. దళితులకు యే రకంగా అయితే దళిత బందు అందిస్తున్నారో వికలాంగులకు కూడా అదే విధంగా వికలాంగ బంధ ఇవ్వాలనీ, పింఛన్ 6వేలు ఇవ్వాలని, వికలాంగులకు స్వయం ఉపాధి కింద షరతులు లేకుండా ఐదు లక్షల రూపాయల లోన్ మంజూరు చేయాలని అన్నారు. వికలాంగులందరికీ అంత్యోదయ కార్డు మంజూరు చేసి ఎవరైతే వికలాంగులకు సకలాంగులు వివాహం చేసుకుంటారో వారికి ఐదు లక్షల రూపాయల మంజూరు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క వికలాంగుడికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని, న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న వికలాంగులు